# పేరెంట్సు దేవోభవ

పాలకూర సీతాలత

కొడుకు దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరం చూసి పొంగిపోయేడు జమదగ్ని. కొడుకు అలాంటి ఉత్తరం రాస్తాడని ఏనాడూ అనుకోనందువల్ల ఆ ఉత్తరం అతని నెత్తిన కిరీటం పెట్టినట్లయింది. ఈ ప్రపంచానికే సార్వభౌమత్వం లభించినట్లయింది. గుండెల్లోంచి ఆనందం ఎగదన్నింది.

"ఏమేవ్..." అంటూ భార్యను పిలిచాడు.

ఏమిటంటూ వచ్చింది రేణుక.

"పరశురాముడు ఉత్తరం రాసేడు..." అన్నాడు.

ఆమె ముఖంలో ఏమీ మార్పులేదు. నిట్టూర్చింది. మామూలుగానే నిరాశతో "ఏమంటాడు?" అంది.

"మనల్ని తీసుకువెళ్ళడానికి వస్తాడట. ఓ పదిరోజులు ఉంచుకుని పంపిస్తాను అంటున్నాడు...." అన్నాడు ఆనందంతో జమదగ్ని.

"ఎందుకు? ఏం అవసరం లేదు. ఇక్కడ మాకు చాలా బాగానే వుందని, రామని రాసెయ్యండి..." అంది కొంచెం కోపంగా రేణుక.

"రేణుకా..." అన్నాడు జమదగ్ని కొంచెం బాధగా.

"అప్పుడే! వాడి నీచ ప్రవర్తనకు మీకు చీమ కుట్టినట్లయినా లేదేమో గానీ నాకు మాత్రం చాలా బాధగా వుంది. మనం తల్లిదండ్రులమన్న ఉద్దేశ్యంతో ఏనాడైనా చూశాడా? గతిలేక, గడవక వచ్చిన ముష్టివాళ్ళం అనుకున్నాడు. మాటలపోటి మాటలతో గుచ్చాడు. వాడు కొడుకు కాడు. వాడి కారణంగానే కదా ఈ రోజు ఈ ముసలి వయసులో ఇలా దూరంగా వుండవలసి వచ్చింది. మీరు నేను, నాకు మీరు తప్ప మనకి ఏముంది కనుక?...." రేణుక కళ్ళు రక్తవర్ణాలయ్యాయి.

"అన్నీ తవ్వుకోవడంవల్ల లాభం ఏముంది? మనకి ఇంతే రాసిపెట్టుంది అనుకోవాలి. నిజమే!... ఏ కొడుకూ చెయ్యని అన్యాయం మనకు చేశాడు. దూరంగా పొమ్మన్నాడు. ఇక ఇంట్లో వుండమన్నాడు. అంతేనా! మనం సరిపెట్టుకుపోవాలి...." శాంతంగా అన్నాడు జమదగ్ని.

"మీరింత శాంతంగా వుండగల్గుతున్నారు కానీ నా గుండెల్లో మాత్రం శూలాలు దింపేసట్లు వుంది. కని పెంచి పెద్దచేసినందుకు వాడు ఇలా ప్రవర్తిస్తాడని అనుకోలేదు. అందుకే వాడి మాట చెప్పకండి. వాడు వచ్చినా మనం వెళ్ళవద్దు..." ఆవేశంగా అంది.

ఆమె ఆవేశాన్ని అర్థంచేసుకొని మాట్లాడకుండా వుండిపోయేరు జమదగ్ని గతం కళ్ళముందు నిలిచింది.

తను రిటైర్ అయిపోయాకా నెల తర్వాత... ... ...

* * *

"నాన్నగారూ! మీరు ఎలాగూ రిటైర్ అయిపోయారు. మీకు నేను తప్ప ఇంక ఎవరు ఉన్నారు కనుక? ఇక ఆ ఊళ్ళో చేసేది ఏమీ లేదు. మీరు అమ్మ కట్టి వచ్చేయండి. నా దగ్గరే ఉండరుగాని? నాకు ఉన్నంతలో ఏ లోటూ లేకుండా మిమ్మల్ని చూసుకుంటాను. అది నా బాధ్యతకూడా కదా!..." అని కొడుకు పరశురాముడు అంటాడని ఆత్రంగా ఎదురుచూస్తూ కూర్చున్నాడు జమదగ్ని.

కానీ వాడు ఏమీ మాట్లాడలేదు.

ఆశతో మరొక నెలరోజులు ఎదురుచూశాడు.

అయినా కొడుకు నోరు విప్పలేదు.

ఇక ఆగలేక ఆ విషయం రాసి పోస్టు చేసేముందు భార్యకు చూపించాడు.

ఆ ఉత్తరాన్ని రెండుగా చింపింది రేణుక.

"మీరు ఎందుకు అలా తేలికైపోతారు? వాడినే అడగనివ్వండి..." అంది రేణుక.

మరొక రెండు నెలలు గడిచాయి.

"ఏమండీ పంతులుగారూ! మీరు మీ అబ్బాయి దగ్గరకు వెళ్ళటంలేదా?" అని తెల్సిన మిత్రులు పలకరిస్తుంటే తల కొట్టేసినట్లు అయ్యేది. ఏం చెప్పాలో తెలియక చిరునవ్వు నవ్వి ఊరుకునేవాడు.

ఇక ఆగలేక భార్యకు తెలీకుండా కొడుక్కి ఉత్తరం రాసాడు. "నా భావి కార్యక్రమం ఏమిటా?" అంటూ.

దానికి జవాబుగా "బయలుదేరిరండి" అని జవాబు రాశాడు.

అది చూసి చాక్లెట్ దొరికిన చిన్నపిల్లవాడిలాగ సంబరపడిపోయేడు.

ఇల్లు ఖాళీ చేసేసి వెళ్ళిపోదామనుకున్న ఆయన్ని రేణుక కొంచెం వెనక్కి లాగింది.

"ముందువెళ్ళి కొన్నిరోజులు వుందాం! మిగతా విషయాలు తర్వాత చూద్దాం...." అంది.

అనుకున్నరోజునే బయలుదేరి కొడుకు దగ్గరకు వెళ్ళేరు.

పెద్దవారు కావడంతో సాధారణంగా ఆచార వ్యవహారాలంటే కొంచెం పట్టింపులు వుండడం సహజం. మర్రితనం కొద్దీ అనాచారంగా వున్న కొడుకు, కోడలుల ప్రవర్తన కొంచెం కంటకప్రాయంగా వుందని పించేది. వంటంతా పూర్తయ్యాక కానీ స్నానం చేసేదికాదు కోడలు ధవళ.

"స్నానం చేసేక వంట చెయ్యమ్మా" అంది రేణుక కోడలితో.

అంతెత్తున లేచింది ధవళ.

"నాకు ముందునుంచి అదే అలవాటు అత్తయ్యా! అసలే నాకు నీళ్ళు పడవు. నీళ్ళు మాస్తేనే రొంప వస్తుంది. కనుక మిట్టమధ్యాహ్నంగానీ స్నానం చెయ్యలేను...." అంది.

"పోనీ వేడినీళ్ళతో పొద్దున్నే స్నానం చేస్తే?..." సలహా ఇచ్చింది రేణుక.

"భలేవారే! నేను 12 గంటలకు మాత్రం చన్నీళ్ళతో స్నానం చేస్తానా? ఎప్పుడూ వేడినీళ్ళే. మండే ఎండాకాలంలో కూడా వేడినీళ్ళు పోసుకుంటాను..." అంది ధవళ. ఇక ఆమెతో చెప్పి లాభం లేదని అనుకుంది రేణుక. అందుకే స్వయంగా తనే వంటకు పూనుకుంది. ఆ పనికూడా తప్పడంతో ధవళకు చాలా హాయిగా వుంది.

జమదగ్నికి పొద్దునే అయిదారు గంటలకల్లా లేచి స్నానం వగైరాలు కానిచ్చి భక్తిగా కాస్త తత్వగీతాలు పాడుకోవడం అలవాటు. దానికి బ్రేకు వెయ్యాల్సి వచ్చింది.

"నాన్నా! పొద్దున్నే ఏమిటీగోల? పడుకునేవాళ్ళకు గొప్ప కష్టం సుమా! అవన్నీ మానెయ్..." అంటూ హుకుం జారీచేశాడు కుమారరత్నం.

జమదగ్నిది సర్దుకుపోయే మనస్తత్వం. అందుకే ఆపని చెయ్యడం మానేశాడు.

ఆ తర్వాత పదిరోజులకు ధవళ తల్లిదండ్రులు వచ్చారు కొన్నాళ్ళు వుండిపోవాలని.

ధవళ తండ్రి అగ్నిహోత్రుడుగారు. అడుగు పొడవున్న లంకపొగాకు చుట్టలు అరడజను వరసగా కాల్చిపారెయ్యగల సమర్థుడు. ఎప్పుడు చూసినా గుప్పుగుప్పున పొగవదులుతూ కన్పడతాడు. ఆ పొగ కిట్టదు పాపం జమదగ్నిగారికి. ఆయన ముందే సోఫాలో మకాం వేసుక్కూర్చుని "చెప్పండి బావగారూ! విశేషాలు..." అంటూ చుట్ట అంటిస్తాడు. ఆ ఘాటుకి తల తిరిగినంతపని అవుతుంది జమదగ్నిగారికి.

"అబ్బ! ఈ చుట్ట కంపు భరించలేకుండా వున్నాను..." అన్నాడొకసారి జమదగ్ని.

"భరించలేకపోతే నిక్షేపంగా ఇక్కడ్నుంచి వెళ్ళిపోవచ్చు వచ్చినవాళ్ళకి. మాకేం అభ్యంతరాలు లేవు" అంది ధవళ ఆ మాటలు విని.


**వాడి నీచ ప్రవర్తనకు మీకు చీమ కుట్టినట్లయినా లేదేమో గాని నాకు మాత్రం చాలా బాధగా ఉంది. మనం తల్లిదండ్రులమన్న ఉద్దేశ్యంతో ఏనాడైనా చూశాడా? గతిలేక, గడవక వచ్చిన ముష్టివాళ్ళం అనుకున్నాడు.**

ఆశ్చర్యపోయాడు జమదగ్ని. కోడలుపిల్లకి తమ రాక అంత ఇష్టంలేదని అక్కడకు వచ్చిన రెండు రోజులకే గుర్తించినా ఆ విషయం తెలియని వాడిలా వుండిపోయేడు. ఈ రోజు ఆ అయిష్టతను ఆమె బైటకు కక్కేస్తుందని అనుకోలేదు.

"ఒక్కొక్కళ్ళకు ఒక్కొక్క అలవాటు వుంటుంది. ఏ అలవాటు లేకుండా వెల్చుకింది సన్యాసిలా అందరూ మీలాగే వుంటారా?" అంది మహ్వా.

అదివిని ఒక వెర్రినవ్వు నవ్వాడు అగ్నిహోత్రుడు. మర్యాద కోసం అయినా మాతుర్ని మందలించలేదు. కొడుకు కూడా ఆ మాటలు విన్నా విననట్లు వుండిపోవ డంతో మరింత బాధ కల్గింది జమదగ్నికి. ఆయనకు పౌరుషం పుట్టుకొచ్చింది. గతిలేని వాడిలాగ ఈ ఛీత్కారాల మధ్య ఎందుకు వుండటం? తనకు ఏం లోటు? తను వెనుక వేసినదానితో హాయిగా బ్రతకవచ్చు. విడిగా వెళ్ళిపోతే?!... మళ్ళీ ఆలోచించేడు. మరి కొన్నాళ్ళు చూద్దాం అనుకున్నాడు. ఆయనకు సహనం ఎక్కువేమరి.

మరొకరోజు మధ్యాహ్నం సోఫాలోనే నిద్రకు ఉపక్రమించి ఆర్పకుండానే చుట్టను హాల్లో విసిరేసి పడుకున్నాడు అగ్నిహోత్రుడు. అది వెళ్ళి నేలమీద పరిచిన కార్పెట్‌ను అంటించింది. ఆ తర్వాత వచ్చిచూసి దాన్ని ఆర్పారు.



"భలేవాడివయ్యా! బంగారంలాంటి కార్పెట్ తగలబెట్టావు కదా!..." అన్నాడు జోక్ చేస్తున్న వాడిలా.

ముఖం ముడుచుకున్నాడు అగ్నిహోత్రుడు. ఊరుకోలేకపోయింది ధవళ తల్లి స్వాహా.

ఫర్వాలేదు లెండి...అది మా అమ్మాయికి మేము కొనిచ్చినదే. మీరేం బాధపడక్కర్లేదు. మీరు కొని తెచ్చిన వస్తువులకు అలాంటి ప్రమాదం ఏమైనా జరిగితే అప్పుడు మీరు బాధపడుదురుగాని..." అంది స్వాహా.

ధవళ వెక్కిరింపుగా అంది.

"నా బొంద! ఆయన మా సంసారంకోసం కొని ఇచ్చిన వస్తువులు ఏమీ లేవులే... ఆయన సంగతి నీకు తెలియదా ఏమిటి?..."

సిగ్గుతో చితికిపోయేడు జమదగ్ని. అవనత వదనుడై పెదవి కదపలేకపోయాడు. కోడలు చెప్పిన దానిలో అబద్ధం ఏమీ లేకపోయినా, ఆ చెప్పిన తీరు, గొంతులోని వెక్కిరింపూ అతనికి ముల్లులాగ గుచ్చుకున్నాయి.

రేణుక మాత్రం ఊరుకోలేకపోయింది.

"పెద్దతరం, చిన్నతరం లేకుండా ఏమిటా మాటలు? కొంచెం మంచిగా మాట్లాడలేవూ?" కోడల్ని నిలదీసింది.

మూతి వంకరగా తిప్పింది ధవళ.

"నా మంచితనం మంచివాళ్లతోనే..." అంది కట్టె విరుపుగా ధవళ.

"అంటే నీ ఉద్దేశ్యం..." కోపంగా అంది రేణుక.

"బుర్ర అంటూ వుంటే ఈ పాటికి అర్థం అయి వుండాలిమరి!..." ధవళ అరిచింది.

దాంతో అత్తకోడళ్ళు ఇద్దరూ వాదన పెంచుకున్నారు.

ఆ రగులుతున్న మంటలో ఇన్ని నీళ్ళు పోశారు జమదగ్ని.

ఆ తర్వాత మరొక పదిరోజులకు అగ్నిహోత్రుడు, స్వాహా వెళ్ళిపోయారు.

చిన్నచిన్న విషయాల్లో అభిప్రాయ బేధాలు రావడం, అది సరిపెట్టుకోలేక రేణుక ఏదో అనడం, అందుకు ధవళ కూడా తనేం తక్కువ తినలేదన్నట్లుగా గొంతు పెంచడం జరుగుతూనే ఉంది.

ఒకరోజు స్నానానికి వెళ్ళబోతూ తన మూడుపేటల గొలుసుతీసి హడావుడిగా బెడ్‌రూంలో అలమారలో వున్న హాండ్‌బాగ్‌లో పడేసింది ధవళ. స్నానం చేశాకా దాన్ని తీయలేదు. అలాగే రెండు రోజులు గడిచాయి.

వేసవికాలం వల్ల ఆమె వళ్ళంతా పేలింది. మెడమట్టూ చెమటకాయలు వచ్చాయి. అందుకనే గొలుసు వేసుకోకపోతే హాయిగా వుంది. కనుకనే దానిసంగతి మర్చిపోయింది. మరొక నాల్గురోజుల తర్వాత గుర్తొచ్చింది. ఎక్కడ పెట్టిందో మాత్రం గుర్తులేదు. అందుకనే ఇల్లంతా ఒకసారి తిరగతోడింది. బీరువా అంతా తెరిచి సర్దింది. బట్టలన్నీ ఒక్కొక్కటే తీసి చూసింది. ఎంత వెతికినా కన్పించలేదు.

వయసు తెచ్చిపెట్టిన చాదస్తం రేణుకను ఊరుకోనియ్యలేదు..

"అంత అజాగ్రత్త అయితే ఎలాగే పిల్లా?... అందులోనూ ఇటువంటి విషయాల్లో అదిపోతే మళ్ళీ జన్మలో అలాంటిది కొనుక్కోగలమా?..." అన్నారు.

వెదుకుడులోపడి ఆ మాటలు విన్నా పట్టించుకోలేదు.

"ఈ కాలం పిల్లవాళ్ళకి అసలు లక్ష్యం లేదు... మతిమరుపు జాస్తి" ఆ మాటలు విన్నా నోరు ఎత్తలేదు ధవళ.

"అవున్లే నీకేం బాధ? సంపాదించి తెచ్చేది వాడు. ఈ నష్టం వాడికే కానీ నీకు కాదుగా. నీమనసు కుట్టేసంత బాధకూడా లేదు నీకు..." అంది రేణుక.

ఈసారి ధవళ నోరు విప్పింది. విప్పడంకాదు పులిలా గర్జించింది.

"అవును... ఇప్పుడు నాకు అర్థం అయింది. నన్ను చీవాట్లు వెయ్యడంకోసం మీరే ఆ గొలుసు దాచేశారు. నేను ఏడిస్తే ఆనందించాలని మీరే ఈ పాడుపని చేశారు..."

బిత్తరపోయింది రేణుక. ఇంతటి అభాండం తనమీద పడుతుందని ఊహించలేదు. ఊహిస్తే నోరు మూసుకుని కూర్చునేది. కోడలు ముందు ముందు జాగ్రత్తగా వుంటుందని రెండు చీవాట్లు వేద్దామనుకుంది. అదొచ్చి ఇలా అయింది.

"నాకేం తెలియదు..." అంది.

"అలా అంటే నేను నమ్ముతానా? వెయ్యవల్సిందేదో వేసేసి ఇప్పుడు అమాయకంగా ముఖం పెడుతున్నారు..."

అంతే.. అదే చిలికి చిలికి గాలివానయ్యింది.

"దొంగతనం అంటకట్టిన ఈ ఇంట్లో మేం వుండం..." అనేంతవరకు వచ్చింది.

"పోతేపొండి!... ఎవ్వరూ కాళ్ళు పట్టుకుని బతిమాలరు..." అంది ధవళ. పరశురాముడు రెండువైపులా నచ్చచెప్పబోయాడు కానీ లాభం లేకపోయింది. జమదగ్నికి కూడా పట్టుదల వచ్చింది. అందుకే వెళ్ళిపోవాలన్న నిర్ణయం మారలేదు మరి. అప్పుడు పరశురాముడు అరిచేడు ఇంట్లోంచి పొమ్మని. జమదగ్ని, రేణుక మళ్ళీ తమ ఊరికి వచ్చేశారు.

మరోపదిరోజుల తర్వాత కోడలు క్షమించమంటూ ఉత్తరం రాసింది.

"గొలుసు దొరికింది. మిమ్మల్ని అనవసరంగా ఆడిపోసుకున్నాను. ఇక్కడే ఉందురుగానీ రండి..." అంటూ.

కానీ రేణుక ఇంక ఆ గడప తొక్కకూడదని నిర్ణయించుకుంది.

నాల్గునెలలు గడిచిపోయాకా, ఇదిగో .... ఈ ఉత్తరం.



## ఇంజక్షన్

డాక్టర్ రూంలోంచి బయటకొచ్చిన పరాంకుశాన్ని అడిగాడు శ్రీరాం "ఎన్ని ఇంజక్షన్లు చేసారు?"

"పది రూపాయలిచ్చాను. చిల్లరలేదని మూడు ఇంజక్షన్లు చేశారు" చెప్పాడు శ్రీకాంత్.

—బి.వి. బాలాజీ (విశాఖపట్నం)

* * *

కొడుకు ఉత్తరానికి రావటంలేదని జవాబు రాయాలని అనుకుంటుండగానే పరశురాముడు , ధవళ స్వయంగా వచ్చేశారు.

"నాన్నా! నువ్వు నన్ను క్షమించినట్లు లేదు..." అన్నాడు బాధగా.

"అవును అత్తగారూ! చిన్నవాళ్ళం మీరిలా పంతం పడితే మేము ఏమైపోతాం?" అంది ధవళ.

"అబ్బే! మాకేం కోపం లేదురా! అయినా మేం ఇక్కడే వుంటాం..." అన్నాడు జమదగ్ని.

"సరే.. మీరు చెప్పిందే వేదం. నేను బలవంతం చేసినా నామాట వినరు. ఒకపని చెయ్యండి. మీకు కోపంలేదన్న నిదర్శనంగా ఒక పదిరోజులు మాతో రండి. ఆ తర్వాత మీ ఇష్టప్రకారమే వచ్చేద్దురుగానీ..." అన్నాడు పరశురాముడు. మాట్లాడలేదు జమదగ్ని.

రేణుక మాత్రం అందుకు కూడా నిరాకరించింది.

"మేము రాము..." అంది ఖచ్చితంగా.

జమదగ్ని నచ్చచెప్పేడు. "పదిరోజులే కదా...పోనీలే వాళ్ళ సరదా కూడా తీరుతుంది. మరీ అంత మొండిపట్టు పనికిరాదు. ఈసారి అక్కడ గొడవలు ఏమీ జరగవులే..." అంటూ నచ్చచెప్పాడు.

ఆ పంతానికి లొంగిపోయింది. బయలుదేరి వెళ్ళారు అందరూ.

ఆ పదిరోజులూ జమదగ్ని, రేణుకలను [illegible] చూశారు.

జగడం అనే మాటకు తావులేకపోయింది. వాళ్ళు





## నీళ్ళు

అత్త ఆరళ్లకు భోరున ఏడ్చేస్తోంది కోడలు పిల్ల. అది చూసి అత్త — "మూడు కోడల పిల్లా ఏడిస్తే ఏడ్చావ్ గానీ నీళ్ళన్నీ పట్టి ఫ్రిజ్‌లో పెట్టు. ఏడ్చెంతా అయ్యాక తాగొచ్చు. హైద్రాబాద్‌లో నీళ్ళ కరువై ప్రతి బొట్టూ పొదుపుగా వాడుకుంటుంటే కన్నీళ్ళన్నీ వృధా చెయ్యడానికి బుద్ధిలేదూ?" అని గదమాయించింది.

—విజయలక్ష్మి
(సికింద్రాబాద్)

కాళ్ళుకడిగి నెత్తిన నీరు చల్లుకునేందుకు సిద్ధం అయినంత పనిచేశారు. 'ఆదిలక్ష్మి వంటి అత్తగారివమ్మా!....' అంటూ ధవళ పాటలు పాడలేదు గానీ అంత పనీ చేసింది.

'ఓ నాన్నా! నీ మనసే వెన్న... అమృతం కన్నా అది ఎంతోమిన్న' అంటూ తండ్రి చుట్టూ ప్రదక్షిణలు చేసి పాటలు పాడలేదు పరశురాముడు. కానీ అంతపనీ చేశాడు.

ఆ ముసలి తల్లిదండ్రులకు తాము వుంటున్నది కొడుకు ఇంట్లోనా లేక స్వర్గంలోనా అని అనుమానం వచ్చింది.

పదిరోజులు పది నిముషాల్లా గడిచిపోయాయి.

రోజులు అంత ఆనందంగా గడుస్తుంటే మరికొన్నిరోజులు వుండాలని పాపం ఆ తల్లిదండ్రులకు అనిపించినా కొడుకూ, కోడలూ కూడా అగ్నిహోత్రుడుగారి దగ్గరకు ప్రయాణం పెట్టుకోవడంతో మరి ఆ సంగతి ఎత్తలేదు.

ఆ రోజు నలుగురూ కలిసే ప్రయాణం పెట్టుకున్నారు.

మామూలు బస్సులో కాక లగ్జరీ టూరిస్టు బస్సులో కూర్చోపెడితే ఆశ్చర్యపోయాడు జమదగ్ని. బస్సు బయలుదేరబోతుంటే ఎవరితోనో మాట్లాడుతూ కొడుకు కన్పించాడు. ఆ తర్వాత వచ్చి బస్సు ఎక్కాడు. బస్సు బయలుదేరింది.

మరో రెండు గంటల్లో ఒక జంక్షన్ వచ్చింది. అక్కడ కొడుకు కోడలు దిగిపోయారు.

"మేం వస్తాం నాన్నా! వీలుంటే నీ దగ్గరకు తర్వాత వస్తాను. ఈ బస్సు మన ఊరు మీంచే వెళ్తుంది. అక్కడ దిగిపో" అంటూ వెళ్ళిపోయాడు పరశురాముడు.

వారే ఎవరితోనో కబుర్లాడుతూ కాలం గడిపేడు జమదగ్ని.

బస్సు తమ ఊరిరాగానే దిగిపోయాడు.

"నమస్కారం! నేను మీ అబ్బాయి కొలీగ్‌ని. మీతో టైము ఎలా గడిచిపోయింది. వస్తువుంటండి..." అంటూ నమస్కరించేడు పుంస్త్ర్య.. అతనితోనే జమదగ్ని గారు అంతవరకూ మాట్లాడుతూ టైముపాస్ చేసింది. బస్సు వెళ్ళిపోయింది.

ఇల్లు చేరారు జమదగ్ని, రేణుక.

* * *

ఆ మర్నాడు రేణుక అంది ఆనందంతో

"కొడుకు, కోడలు అంత ఆదరంగా చూస్తారని నేను కలలో కూడా అనుకోలేదు. ఎంతలో ఎంత మారిపోయారు!"

జమదగ్ని మాత్రం పళ్ళు నూరుకున్నాడు. కన్నతల్లిదండ్రులను పరశురాముడు అంత ఘోరంగా వాడుకుంటాడని ఎప్పుడూ అనుకోలేదు. అందుకే ఆయనకు చాలా మంటగా వుంది.

"అవును వాడు మనతో వ్యాపారం చేశాడు. మనల్ని ఒక పావుగా వాడుకున్నాడు. మనమీద వాడికి అంత భక్తి భావం మరి!" అన్నాడు బాధగా.

"ఏమిటండీ! అసలు విషయం ఏమిటి?" అడిగింది అర్థంగాక.


ఆమెకు అసలు రహస్యం బోధపరిచాడు.

"ఈ మధ్య ప్రభుత్వ సంస్థలన్నీ తమ ఉద్యోగస్థులకు కొత్తగా "ఆలిండియా టూర్" అనే సౌకర్యం మొదలు పెట్టాయి. అంటే ఆ ఉద్యోగి భార్యాబిడ్డలతో, తల్లిదండ్రులతో ఇండియాలో ఏ మూలకైనా వెళ్ళిరావడాన్కి ప్రభుత్వమే ఖర్చు భరిస్తుందన్నమాట. ఈ అవకాశం చూసుకుని బోలెడు టూరిస్టు బస్సులు పుట్టుకువచ్చాయి కాశ్మీరుదాక. కానీ ఆయా ఉద్యోగస్తులు ఇటు టూరిస్టువాళ్ళు కూడా ఈ అవకాశం దుర్వినియోగం చేసుకుంటున్నారు. దీన్ని కేవలం డబ్బు సంపాదించడానికి ఒకమార్గంగా మార్చుకున్నారు. ఇప్పుడు పరశురాం పనిచేస్తున్న చోటునుంచి కాశ్మీరుదాక వెళ్ళిరావడాన్కి ఖర్చు రు.1800 అని నిర్ణయించి తల ఒక్కంటికే ఆ సొమ్ము అందజేస్తున్నారు. ఆ డబ్బులో కేవలం రు.200 ఆ టూరిస్టు వాడికి లంచంగా ఇస్తే 'తమ బస్సులో ఆ వ్యక్తి కాశ్మీరు వెళ్ళాడు' అని సర్టిఫై చేస్తూ టిక్కెట్లు ఇస్తాడు. ఆ ఉద్యోగి కాశ్మీరు కాక మరివేరే దగ్గర ఊరికి వెళ్ళి శలవు ఖర్చు చేసివస్తాడు. అంటే ఉద్యోగికి టిక్కెట్టు ఒక్కంటికి రు.1600 మిగుల్చుకుంటున్నాడన్నమాట. శలవు అయిపోయాకా ఆ టిక్కెట్టు జత పరిచి బిల్లు సబ్మిట్ చేస్తాడు. ఆ రకంగా సంపాదించిన సొమ్ము వేరే రకంగా ఖర్చుపెట్టుకుంటారు లేదా బ్యాంకులో దాచుకుంటాడు. ఇప్పుడు పరశురాముడు చేసిందీ అదే. తల్లిదండ్రుల్ని కూడా కాశ్మీరు తీసుకువెళ్తున్నానని చెప్పి ఆఫీసులో రు.3600 తీసుకున్నాడు. నిజానికి ఎవ్వరూ వెళ్ళడంలేదు కాశ్మీరు. పరశురాముడు, ధవళ, జమదగ్ని, రేణుకలు కాశ్మీరు వెళ్తారని ప్రభుత్వం ఇచ్చిన సొమ్ము మొత్తం రు.7200. అందులో వెయ్యిరూపాయలు బస్సువాడికి ఇచ్చినా పరశురాముడి నికరలాభం రు.6200 అన్నమాట.

అయితే తల్లిదండ్రులను టూరిస్టు బస్సులో ఎందుకు కూర్చోబెట్టాడు?

నిజానికి ఆ బస్సే కాశ్మీరు వెళ్తున్న(ట్లుగా అబద్ధం ఆడబడుతున్న) బస్సు. ఇలాంటి అన్యాయాలు జరుగుతున్నాయని మేనేజిమెంటువాళ్ళు బస్సు బయలుదేరేముందు ఉద్యోగి క్లైము చేసినంతమందీ ఎక్కుతున్నారా లేదా అని తనిఖీ చేసేందుకు ఒక అధికారిని పెట్టారు. పరశురాముడు తల్లిదండ్రులను కూడా కాశ్మీరు తీసుకువెళ్తున్నట్లు చెప్పి సొమ్ము తీసుకున్నాడు కనక బస్సు బయలుదేరే ముందు నల్గురినీ చూపించాలి అతను అధికారికి. అందుకే నాటకం ఆడి, ప్రేమగా నటించి తల్లిదండ్రులను తన దగ్గరకు పిల్చుకున్నాడు. బస్సు బయలుదేరే ముందు పరశురాముడు మాట్లాడింది ఆ అధికారితోనే.

బస్సు ఎక్కేముందు అందరూ వున్నరా లేదా అని చూసేకా ఆ అధికారి వెళ్ళిపోతాడు. ఆ తర్వాత పక్క ఊర్లలో జనాలు దిగిపోయి వాళ్ళవాళ్ళ ఇంటికి వెళ్ళి శలవు గడిపి వస్తున్నారు. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు అన్నట్లుగా ప్రభుత్వం ఎన్ని కట్టుదిట్టాలు చేసినా జరిగే అన్యాయం జరిగి పోతూనే వుంది. పరశురాముడి కపట ప్రేమకు ఇదే కారణం



తల్లిదండ్రులను కేవలం డబ్బుకోసం వాడుకున్నాడు. ఇలాంటివాడు తండ్రి వచ్చిపోతే పోయాడన్న బాధకన్నా ఆలిండియా టూర్లో ఒక టిక్కెట్టు తగ్గిపోయిందనే బాధే ఎక్కువుంటుంది.

ప్రేమగా చూడని కొడుకుకుతల్లిదండ్రులను కాశ్మీరు యాత్రకు తీసుకువెళ్తాడని ఆశించడం గొడ్డుటావు పాలు ఇస్తుందనుకోవడమే. జమదగ్ని బాధ అందుకు కాదు

తమని ఘోరంగా వంచించి కేవలం డబ్బు సంపాదించుకున్నందుకు బాధ. తాము వాడి దృష్టిలో మనుషులు కారు. కేవలం డబ్బు సంపాదనకు ఒక వస్తువు.

ఆ విషయం తెల్సిన రేణుక కూడా మండిపడింది.

"ఛీ! వీడింత నీచుడు అనుకోలేదు. అంటే డబ్బు కోసమే ఆ వెధవ ప్రేమ ఒలకబోశాడన్నమాట..." అంది

నిర్లిప్తంగా వుండిపోయేడు జమదగ్ని.

రేణుక అడిగింది "ఈ విషయాలు అన్నీ ఎలా తెలుసు?..."

"అంతా గమనించాను. మనల్ని టూరిస్టు బస్సులో ఎక్కిస్తున్నపుడే అనుమానం వచ్చింది. ఇలాంటి అన్యాయాలు జరుగుతున్నాయని ఇదివరకు విన్నానులే. ఆ తర్వాత బస్సులో వాళ్ళ మాటలుబట్టి అది నిజమే అని తెల్సింది. అందరూ N.G లే (నాన్ గోయర్స్) ఆ తర్వాత వాడి మిత్రుడు 'పులస్త్య'తో కూడా మాట్లాడుతూ కూర్చున్నాను కదా! అతనివల్ల పూర్తి నిజాలు తెలిశాయి. 'మా అమ్మ నాన్నలను కూడా టూర్ తీసుకువెళ్తున్నట్లు చూపించి డబ్బులు మిగిల్చి ఫ్రిజ్ కొంటానురా..." అని మన పరశురాముడు ఆ పులస్త్యతో

అన్నాడట. నాకు అంతా తెల్సుననే ఉద్దేశ్యంతో మాట్లాడాడు పులస్త్య. మన సుపుత్రుడు మాత్రం ఇదంతా మనకు రహస్యంగానే వుంచాడు మరి!

కొడుకు చేసిన ద్రోహం కళ్ళముందు కదులుతుండగా గొంతుపూడుకుపోయిన ఆ తల్లిదండ్రులు మరి మాట్లాడలేకపోయారు.

'మాతృదేవోభవ...' అనీ 'పితృదేవోభవ...' అని అన్నారు పెద్దలు.

ఇద్దర్నీ కలిపి ఏమంటారో తెలియక 'పేరెంట్స్ దేవోభవ...' అందాం.

తల్లిదండ్రుల్ని అలా భావించే పుత్రరత్నాలు ఈ కలియుగంలో ఎందరు?

జమదగ్ని అన్నాడు —

"ఈ అన్యాయం ఆపడానికి ఒకే మార్గం నాకు తోస్తోంది. ఉద్యోగి ఎప్పుడు ఆలిండియా టూర్ వెళ్ళదలచుకున్నాడో కనుక్కొని అతనికి డబ్బు ఇయ్యకుండా ఆఫీసువాళ్ళే ఆ కాశ్మీరుకి రైలు టిక్కెట్టు కొనిచ్చి ఉద్యోగికి ఇవ్వాలి. అతను వెళ్ళివచ్చాకా ఆ టిక్కెట్టు మధ్యలో కాన్సిల్ చేయించుకోలేదని రైల్వేనుంచి సమాచారం పొందాలి. అదొక్కటే దారి...."

మాట్లాడలేదు రేణుక.



కబడీ

"కబడీ ఆటలో ఎప్పుడూ ఇండియానే గెలుస్తుందెందుకురా?" టీచర్ అడిగాడు రాముని.

"ఎందుకంటే సార్ కబడి మన ఇండియా తప్ప మరేదేశాలు ఆడవు కదా! అందుకు."

—విజయలక్ష్మి
(సికింద్రాబాద్)

(ఈ మధ్య ఈ ఆలిండియా టూర్ పేరుతో జరుగుతున్న ఘోరాలు చూశాక ఈ కథకు ప్రేరణ లభించింది. చివర్లో జమదగ్ని ఇచ్చిన సూచన ప్రభుత్వం పాటిస్తే కొంతవరకూ మెరుగు కావచ్చు — పాంకూర సీతాంత)

*